పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం : కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని మున్సిపల్ కమిషనర్ వై. ఓ.నందన్ పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మున్సిపల్ మెయిన్ స్కూల్ విద్యార్థులతో కలిసి స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. ప్రొద్దుటూరు, కమలాపురం, ఎర్రగుంట్ల ప్రాంతాల అధికారులతో పాటు, కడప నగరపాలక శాఖాధిపతులు, సిబ్బంది పాల్గొని స్వచ్ఛత సంబంధించిన కర్తవ్యాన్ని గుర్తు చేసుకున్నారు. ' స్వచ్ఛత కోసం నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాను. నేను నా పరిసరాలను శుభ్రంగా ఉంచుతాను.. ఇతరులను కూడా స్వచ్ఛతను పాటించడానికి ప్రోత్సహిస్తాను.. మన గ్రామాలు, పట్టణాలు, నగరాలు శుభ్రంగా ఉండేందుకు కృషి చేస్తాను.. ఈ 'స్వచ్ఛతే హీ సేవ' ఉద్యమంలో భాగస్వామ్యం అవుతాను.' అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు, కమలాపురం, ఎర్రగుంట్ల కమిషనర్లు, అదనపు కమిషనర్ కె. రాకేష్ చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, సిటీ ప్లానర్ సురేష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, సిఎంఎం హరి ప్రసాద్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తొలగిద్దాం : విసి

సమాజానికి, పర్యావరణానికి ప్లాస్టిక్ ఒక భూతంగా మారిందని, దాన్ని మనం నివారించకపోతే అనేక దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైవీయూ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతో హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైవీయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత పై అవ గాహన, ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.పద్మ, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎస్.పి. వెంకటరమణ, పిఒలు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం : ఎంపీ

ప్రజాశక్తి -కడప

అన్నదానం అభినందనీయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్, బాషా నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా గురువారం నగరంలోని 30వ డివిజన్ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఎన్ఆర్ఐ అన్సర్ ఆధ్వర్యంలో బార్మీ అన్నదాన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని పేదలకు ధనవంతులు తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించినప్పుడే, వారిని ఆదుకున్న వారవుతారని చెప్పారు. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని చెప్పారు. పేదల ఆకలి తీర్చడం ఎంతో గొప్పది అన్నారు. మహమ్మద్ ప్రవక్తను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేస్తున్న ఇన్‌ఛార్జి విసి

సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ సంబంధించిన ఆర్కిటెక్చర్ రెండవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి విసి ఆచార్య జి.విశ్వనాథ కుమార్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎన్. రాజేష్ కుమార్ రెడ్డి గురువారం విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ 2వ సెమిస్టర్‌లో 90శాతం మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్ సైట్‌లో పొందుపరిచామన్నారు. అతి తక్కువ సమయంలోనే పరీక్ష ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్ష విభాగం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్ర రెడ్డి, ఉదయ ప్రకాష్ రెడ్డి, లక్ష్మీ ప్రవళిక పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి అవకాశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రపంచ స్థాయిలో మెరవాలంటే ప్రణాళిక బద్ధంగా చదవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. 'యుఎస్ఎ, కెనడా యు.కె, ఆస్ట్రేలియా దేశాలలో ఉన్నత చదువులు, ప్లేస్‌మెంట్ అవ కాశాల'పై అవగాహన కార్యక్రమం గురువారం వైవీయూలోని సేనేట్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం మీకోసం ఎదురు చూస్తోందని విద్యార్థి దశలో సంపూర్ణ జ్ఞానాన్ని సమ పార్జించుకోవాలన్నారు. ఆంగ్లంలో సంభాషించే వారిని, చదువుతున్న కోర్సులో మార్కుల పరంగా ప్రతిభ చూపిన వారికి, విదేశాల్లో విద్య, ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. చికాగో ఆర్‌డిఎల్ టెక్నాలజీ సిఇఒ వ్యవస్థాపకులు కె.రామారావు మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులపై చదువులకు, పీజీ విద్యార్థుల పరిశోధనలకు, ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ఆర్డీఎల్ టెక్నాలజీ సంస్థ ఉచితంగా సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు

ప్రజాశక్తి - కడప

జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యువజోత్సవాలు స్వామి వివేకానందుడి జయంతి జనవరి 12ని పురస్కరించుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో నిర్వహిస్తారన్నారు. డాక్టర్ జి. విశ్వనాధ కుమార్ మాట్లాడుతూ యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 16వ డివిజన్ కార్పొరేటర్ బి. లక్ష్మి దేవి మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని కొనియాడారు. స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ స్టెప్ వారు యువజనోత్సవాలు తమ కళాశాలలో నిర్వహించడం ఆనందదాయకమని చెప్పారు. యువజ నోత్సవాలలో దాదాపు 230 మంది జిల్లా నలుమూలల నుంచి వివిధ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహు మతులు ప్రదానం చేశారు.

యువజనోత్సవాల్లో భాగంగా నృత్యాలు చేస్తున్న కళాకారులు

పేదలకు భూములు పంచాలి : వ్య.కా.స

ప్రజాశక్తి-అట్లూరు

భూ కబ్జా దారుల చేతుల్లోని భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా భూములను పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అట్లూరు మండలం నలిగామయపల్లె రెవెన్యూ పొలం సర్వేనంబర్ 40లో గురువారం పేదలు భూపోరాటం నిర్వహించారు. వారికి మద్దతుగా నిలబడి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన ప్రతిసారి పేదలకు దక్కాల్సిన భూములు కుంచించుకు పోతున్నాయని పేర్కొన్నారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నాయకులు భూములను ఆక్రమించుకోవడం సాధారణ మైందని పేర్కొన్నారు. సోమశిల మునక ప్రాంత మునకకు చెందినవారి భూములను గత ప్రభుత్వంలో కొంతమంది నాయకులు ఆక్రమించుకుని అనుభవిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని, నిర్వాసితులకు న్యాయం చేయలేదని వారు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడంబరంగ రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలు పరిష్కరిస్తామని చెప్పారని. ఇప్పటికీ అనేక కారణాలతో రెండు దపాలుగా రద్దు చేశారని చెప్పారు. రెవిన్యూ సదస్సులు నిర్వహించి అసైన్డ్ మెంట్ కమిటీద్వారా కాకుండా భూములు పొందిన భూకబ్జా దారుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, వాటిని పేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు, సర్వే నంబర్ 40లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, పంచాయతీలో వందల సంఖ్యలో భూమిలేని పేదలు ఉన్నారని వారందరూ ఐదు నెలలుగా భూపోరాటంలోపాల్గొని, ముళ్ళపొదలుతొలగించారని, వారందరికీ అసైన్డ్ మెంట్ కమిటీ ద్వారా పట్టాలు మంజురుచేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అట్లూరు మండల అధ్యక్ష కార్యదర్శులు, రమణయ్య, దుర్గమ్మ, నాయకులు చంద్ర, గంగయ్య పాల్గొన్నారు.

భూ పోరాటంలో మాట్లాడుతున్న వ్య.కా.స జిల్లా అధ్యక్షులు శివకుమార్

ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్

విసిలో పాల్గొన్న కలెక్టర్, జెసి, డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకుని, వాటి లక్ష్య సాధనకు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి స్వర్ణ ఆంధ్ర విజన్- 2047 ప్రణాళిక రూపకల్పన పై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరాబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ విసి మీటింగ్ హాలు నుంచి కలెక్టతోపాటు జెసి అతిథి సింగ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విజన్ ఆంధ్ర- 2047 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాబోవు ఐదు సంవత్సరాలలో జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికను రూపొందించాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటికి అమలు చేయడానికి నూతన ఆలోచనలతో జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించి అక్టోబర్ 15లోగా నివేదించాల్నారు. స్వర్ణాంధ్ర- స్వర్ణ కడప 2047 పై పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించి వారి అభిప్రాయాలను తెలిపే విధంగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. జిల్లాలోని 36 మండలాలు, ఏడు మున్సిపాలిటీ, కడప కార్పొరేషన్‌లో జిల్లా విజన్ ప్లాన్ పై ఫీడ్‌బ్యాక్ సేకరిస్తామని అన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు ఈనెల 30 నాటికి మండల విజన్ యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేసి అందజే యాలన్నారు. జిల్లాలో 6900 ఎకరాల్లో ఉన్న కొప్పర్తి పారిశ్రామికవాడను కీలకంగా తీసుకొని అభివృద్ధికి ప్రణాళికలు రూపొం దించాలన్నారు. ల్లాలో సోలార్, విండ్ వంటి రెన్యువల్ ఎనర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో హార్టికల్చర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉన్నందున ఆదిశగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఒ వెంకట్రావు, జిల్లా వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి సరస్వతి, డిపిఒ ప్రభాకర్, జిల్లా విద్యాధికారి అనురాధ, మెప్మా పీడీ సురేష్, ఎన్ఐసి విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక బుకింగ్ మరింత సులభతరం

నూతన ఇసుక పాలసీ ప్రకారం ఇసుకను ఉచితంగా, సులభంగా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాండ్ బుకింగ్ పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చిందని, ఈ సదుపాయాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి నూతన ఇసుక పాలసీ ప్రకారం ఉచితంగా ఇసుకను పొందేందుకు రాష్ట్ర గనులు, భూగర్భశాఖ వారు ప్రత్యేకంగా రూపొందించిన ఎపి శాండ్ పోర్టల్ (https://www.sand.ap.gov.in) ను వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, జెసి అదితి సింగ్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం ఎపి శాండ్ పోర్టల్ ద్వారా సులభతరంగా ఇసుకను ఎలా బుక్ చేసుకోవాలి ? అనే అంశాలపై కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. వినియోగదారులకు ఉచితంగా ఇసుకను ఇవ్వడమే కాదు, వారు కోరుకుంటే ఆ ఇసుకను వారి ఇంటివద్దకే డెలివరీ చేసే సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు.

పత్రికల్లో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన 'తాపీ'

ప్రజాశక్తి - కడపఅర్బన్

దిన, వార, పక్ష, మాసపత్రికల్లో తొలిసారిగా వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన గౌరవం తాపీ ధర్మారావుకే దక్కుతుందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం వారు తాపీ ధర్మారావు 138వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ అప్పట్లో తాం వేసిన పునాదుల పైనే నేటి పత్రికా రచన ఎంతో ఉన్నత స్థాయిలో నిలిచిందని చెప్పారు. అందుకు చిహ్నంగా ఆయన జయంతని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకుం టున్నామన్నారు. ప్రముఖ అవధాని మాడుగుల శివ శ్రీ శర్మ ప్రసంగిస్తూ ధర్మారావు మనోజ్ఞమైన విజయ విలాస కావ్యానికి హృదయోల్లాసం అనే పేరుతో మనోజ్ఞమైన వ్యాఖ్యానం చేశారని పేర్కొన్నారు. ప్రాచీన కావ్యాలు ఎలా చదవాలో పాఠకులకు బోధపడే ఉపకరణం ఆ గ్రంథమని అన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ 'ఆలయాల మీద బూతు బొమ్మలు ఎందుకు?' ,'పాతపాళి..కొత్త పాళీ' 'సాహిత్య మొర్మరాలు', 'పెళ్లి.. దాని పుట్టుపూర్వోత్తరాలు', 'ఇనుప కచ్చడాలు' వంటి ప్రసిద్ధ గ్రంథాలు రాశారన్నారు. కల్లూరు బాల ఎల్లారెడ్డి ప్రసంగిస్తూ రైతుబిడ్డ, ఇల్లాలు, ద్రోహి, దీక్ష, కీలుగుఱ్ఱం మొదలైన 40 సినిమాలకు పైగా స్క్రిప్ట్, పాటలు రాశారన్నారు. కార్యక్రమంలో జీవ కళ సత్యనారాయణ, నాటక కర్త నాగరాజు, రంగస్థల కళాకారులు ఎవిఎస్ రాజు, మందల మురళి, దేవరశెట్టి గంగయ్య, దాసరి ప్రకాశం, బాల ఓబయ్య, తపలిస్టు గంగయ్య పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ ఫలితాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప సిటీ

కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో 2023-24 సంవత్సరానికి గాను ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారు. 68 మంది ఫస్ట్ క్లాస్‌లో, 97 మందిద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన బోధన వైద్య అధ్యాపకులను, సిబ్బందిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ ప్రత్యేకంగా అభినందించారు. **వైద్య విద్యార్థులకు అడ్మిషన్లు..** ప్రభుత్వ వైద్య కళాశాల కడపలో 2024-25 సంవత్సరానికి గాను వైద్య విద్య అభ్యసించేందుకు నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ర్యాంకులు వచ్చిన వారికి కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం 139 మంది విద్యార్థులు అడ్మిషన్లు పూర్తి చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కోట 139 మందితో ముగిసింది. జాతీయస్థాయిలో కేటాయించిన 26 సీట్ల భర్తీ శుక్రవారం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. వివిధ కేటగిరీలకు కేటాయించిన పది సీట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. దీంతో కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)కు కేటాయించిన 175 సీట్లలో 139 సీట్ల భర్తీ ప్రక్రియ ముగిసింది. మిగతా 36 సీట్లు త్వరలో భర్తీ చేయనున్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

క్రీడల్లో సెయింట్ 'ఆంటోనీస్' సత్తా

ప్రజాశక్తి-కలసపాడు

మండల స్థాయి నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో సెయింట్ ఆందోనీస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరించారు. గురువారం నిర్వహించిన క్రీడల్లో భాగంగా కబడ్డీ పోటీల్లో గీతాంజలి పాఠశాల విద్యార్థులపై ఆంటోనీస్ పాఠశాల ఆడి పాయింట్ల లీడ్‌లో విజయం సాధించారు. విజేతలను పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చిత్తా ప్రతిభావతి, పిఇటిలు ప్రసాద్‌రావు, కోమలామేరి, వినీత్ అభినందించారు. వీరు ఈనెల 25న నిర్వహించే నియోజకవర్గ పోటీల్లో పాల్గొంటారు.

కబడ్డీ ఆడుతున్న ఇరు జట్ల విద్యార్థులు

గొర్రెల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త వీరయ్య మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు గొర్రెలు, మేకల పెంపకంపై గ్రామీణ యువకులు దృష్టి సారించి, పశు విజ్ఞాన శాఖ వారి సలహాలు సూచనలు పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు, అనంతరం కెవికె పశు, విజ్ఞాన శాస్త్రవేత్త సురేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మేకలు, గొర్రెలు పెంపకంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషక యాజమాన్యంలో మెలకువలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాల గురించి రైతులకు వివరించారు, ఇక్కడ శిక్షణ పొంది క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేయాలని సూచించారు, అనంతరం ప్రదర్శనశాలలో వివిధ రకాలైన మేకలు, గొర్రెలను చూపించి వాటి ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు

నగరంలోని హరి టవర్స్‌లో ఏర్పాటు చేసిన నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న చైతన్య అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణమైన యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఎస్ఎఫ్ఐ బృందం గురువారం పరామర్శించింది. బాధిత విద్యార్థి నుంచి వివరాలు అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం విద్యార్థులను భయ భ్రాంతులకు గురి చేస్తుందని, వైస్ ప్రిన్సిపల్, సిబ్బంది తిడుతూ, కొట్టారని, ఆ అవమానాన్ని భరించలేక విద్యార్థి విష ద్రావణం సేవించారని పేర్కొన్నారు. విద్యార్థి ఆరోగ్యం విషమంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీతో విద్యార్థుల జీవితాలతో, ప్రాణాలతో చలగాటమాడుతున్నారని విమర్శించారు. సంఘటన జరిగి కొన్ని గంటలవుతున్నా కనీసం విద్యార్థి ఆరోగ్యం గురించి జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చొరవ చూపలేదని చెప్పారు. గతంలో కూడా ఇదే విద్యా సంస్థల్లో అనేకమంది విద్యార్థులను యాజమాన్యం కొట్టగా చేతులు విరగడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య ప్రయత్నానికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయజ్యోతి, నాయకులు

రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాహుల్ గాంధీ పేరు ఉచ్చరించే హక్కు బిజెపికి లేదని, రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆ పార్టీ నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పై సంజయ్ గైక్వాడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఓల్డ్ రిమ్స్ వద్దనున్న ఇందిరాగాంధీ విగ్రహం సర్కిల్లో జిల్లా కాంగ్రెస్, సిటీకాంగ్రెస్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీని చంపాలని బిజెపి నాయకులు చేసిన వ్యాఖ్యలు దారుణమని పేర్కొన్నారు. ద్వేష పూరిత మాటలపై వెంటనే చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ముస్లిముల రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం బిజెపి తీవ్రవాది పార్టీ అనడానికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. వెంటనే రాహుల్ గాంధీకి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, పులివెందుల నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి ధ్రువ కుమార్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కృష్ణారెడ్డి, గంగయ్య, పిడి సంజయ్ కాంత, హరిప్రసాద్, సుశీల్ కుమార్, పుల్లయ్య, శ్యామలమ్మ, వెంకటరమణ, ఆసిఫ్ ఖాన్ కుళ్లాయప్ప హమీద్, రహమతుల్లా ఖాన్, హబీబుల్లా, పెనుబాల విక్కి, అరుణ్ కుమార్ సాయి షేక్ కమల్ బాష పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కడప అర్బన్

మున్సిపల్ కమిషనర్ వై. ఓ. నందన్ ఆధ్వర్యంలో కడప జిల్లా అర్బన్ సచివాలయాల ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ కార్యక్రమం గురువారం కడప నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరస్పర, ఖాళీల బదిలీల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు కడప అర్బన్ కమిషనర్లు హాజరై సచివాలయ హోదాల ప్రకారం కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. నగరపాలక సిబ్బంది సహాయంతో వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టామని చెప్పారు. మానిటరింగ్, వెరిఫికేషన్ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ ఆఫీసర్లు భాగస్వామ్యం అయ్యారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

వైసిపి ప్రభుత్వ హయాంలో వైవీయూలో ఇష్టానుసారంగా జరిగిన అక్రమ నియామకాలపై సిఐడి విచారణ చేపట్టాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం యోగివేమన విశ్వవిద్యాలయంలో అనుకూలమైన వ్యక్తులను విసి, రిజిస్ట్రార్లుగా నియమించుకుని అవినీతి, అక్రమాలకు, అనైతిక కార్యక్రమాలకు విచ్చలవిడిగా పాల్పడి యూనివర్సిటీని భ్రష్టు పట్టించారన్నారు. ఐదు సంవ త్సరాలలో యూనివర్సిటీలోని ప్రతి విభాగంలో లేని పోస్టులను కూడా సృష్టించి వైసిపి నాయకులు చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారం జగన్ బామ్మర్ది వైవీయూ ప్రస్తుతం బయోటెక్నాలజీ ప్రొఫెసర్ గా పని చేస్తున్న ఈసీ సురేంద్ర నాథ్ రెడ్డి కనుసన్నల్లోనే జరిగిందని విమర్శించారు. వైవీయూలో ప్రక్షాళన జరిపి వీలైనంత త్వరగా వారి స్థానంలో అర్హులైన అభ్యర్థులను రోస్టర్ పద్ధతిలో నియామకాలు జరిపి నిరుద్యోగులకు తెలుగుదేశం ప్రభుత్వంలో న్యాయం చేస్తారని తెలిపారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత సింహ, అమృత్, అక్షయ్ కుమార్ రెడ్డి, ఫరీద్, అరవింద్ పాల్గొన్నారు.

అత్యున్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థులు బాటలు వేసుకోవాలని, క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలని మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఎం. కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా లోని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. యాంటి - హ్యూమన్ ట్రాఫికింగ్ సిఐ జి.రాజు మాట్లాడుతూ బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అవగాహన కార్యక్రమంలో పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ - 100, రహదారి భద్రత, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా అండ్ సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళా పిఎస్ సిఐ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు శాంతమ్మ, నస్రీన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐ ఎం. కృష్ణారెడ్డి

నల్ల కార్బన్ పౌడర్ డంప్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న వీరనాల శివకుమార్

ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే నల్ల కార్బన్ పౌడర్ డంప్‌ను తొలగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ముద్దనూరు రోడులో మూతబడిన బ్రహ్మణి స్టీల్ ఫ్యాక్టరీ వెనుక భాగం కొండలలో భారీ స్థాయిలో ప్రజలకు, పర్యావరణానికి హానికరమైన నల్ల కార్బన్ పౌడర్‌ను డంప్ చేస్తున్నారని తెలిపారు. అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఇలాంటి హానికరమైన డంప్‌లను తొలగించాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, మధు పాల్గొన్నారు.

21న మండల స్థాయి క్రీడా ఎంపికలు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 21, 23తేదీల్లో మండల స్థాయిలో క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు గురువారం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజబాబు తెలిపారు. ఆ మేరకు ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మండల విద్యాశాఖాధికారులు సుబ్బారావు, నాగేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అండర్-14,-17 విభాగాల్లో క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల వ్యాయామ ఉపాధ్యాయ కో-ఆర్డినేటర్ మాధవరెడ్డి మాట్లాడుతూ ఈనెల 21న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగ, చెస్ క్రీడలు ఉంటాయన్నారు. 23న అథ్లెటిక్స్ ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్-14లో పాల్గొనే క్రీడాకారులు 01-01-2011 తర్వాత జన్మించి ఉండాలన్నారు. అండర్-17 విభాగంలో పాల్గొనే వారు 01-01-2008 తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. మండల స్థాయిలో పాల్గొనే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు జమ్మలమడుగు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

దువ్వూరులో మానవ హారంగా ఏర్పడిన విద్యార్థులు, మాట్లాడుతున్న ఎస్ఐ

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- ఎస్ఐ వినోద్ కుమార్

ప్రజాశక్తి - దువ్వూరు

మత్తు పదార్థాలకు బానిస కావ ద్దని విద్యార్థులు ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వ ర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బంగ్లా ఆవరణ నుండి వైయస్సార్ సర్కిల్, పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం వైఎస్ఆర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వినాయక ఫౌండేషన్ సిబ్బంది, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల పోస్టర్‌ను గురువారం శ్రీవీర బ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి స్టాఫ్ నర్సు పి.జీవమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువగా యువత సరదాల కోసం గంజాయి మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమం చారిటబుల్ ట్రస్టు టీం ల్యాబ్ టెక్నీషియన్ డి.రమణకుమార్, ఫార్మసిస్ట్ పి.ఎస్తేరు రాణి, ప్రేమకుమారి, సుదర్శన్ పాల్గొన్నారు.

ఊరూరా బెల్టుషాపులు

- తెల్లవారుజాము నుంచే యథేచ్ఛగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పగలు, రాత్రి అనే తేడా లేకుండా మండలంలో తెల్లవారు జామునుంచే యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మండల కేంద్రంలో, ప్రతి ఊరులో బెల్టుషాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ముద్దనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముద్దనూరు, కొండాపురం, సింహాద్రిపురం, తొండూరు మండలాలున్నాయి. ఈ మండలాల పరిధిలోని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం ముద్దనూరు, పలు గ్రామాల్లో యథేచ్ఛగా పట్టపగలే బ్లాక్‌లో మద్యం అమ్ముతున్నా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెల్టుషాపులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని ఎక్సైజ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపులపై దాడి చేయక పోవడంపై గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయకుండా వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నామ మాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ మండలంలో ఎక్కడా బెల్టుషాపులు, మద్యం విక్రయాలు జరగనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

అగ్నిప్రమాదంలో పూరి గుడిసె దగ్ధం

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లి తండాలో గురువారం మూడే సుబ్బమ్మకు చెందిన పూరి గుడిసె అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కుటుంబంలో అందరూ పనుల కోసం బయటికి వెళ్లడంతో పూరి గుడిసెలో ఉన్న వస్తువులు కాలిపోయాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.17,400 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో పోలీసులు పాల్గొన్నారు.

అరెస్టయినవారితో ఎస్ఐ వినోద్‌కుమార్, పోలీసులు

అంధకారంలో రైల్వేస్టేషన్ రోడ్డు

వెలగని విద్యుత్ దీపాలు - ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

వసతిగృహ దీపాలు తప్ప కనిపించని రోడ్డు

వెలగని వీధిదీపాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు రైల్వేస్టేషన్ నుంచి కడప బైపాస్ రోడ్డు వరకు వెళ్లే దారి అంధకారంలో ఉంది. ఈ రోడ్డులో కొత్తగా విద్యుత్ దీపాలు (బటర్ ఫ్లై లైట్లు)ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో లైట్లు వెలగక వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రయాణం వారు, వాహనదారులు కడప బైపాస్ నుంచి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డులో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి బటర్ ఫ్లై లైట్లు అమర్చారు. కొన్నాళ్లు ఈ దారి విద్యుత్ దీపాలతో వెలిగింది. మూన్నాళ్ల ముచ్చటగా తర్వాత అంధకారంగా మారింది. ఈ రోడ్డు పక్కన బాలుర ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, కళాశాల ఉంది. రోడ్డు పక్కనే పెద్ద బావి లాంటి గుంత ఉంది. వాహనదారులు పొరపాటున అదుపుతప్పి గుంతలో పడితే ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో విష పురుగులు తిరుగుతుంటాయనే భయంతో విద్యార్థుల సౌకర్యార్థం వార్డెన్ హాస్టల్ చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. హాస్టల్ లైట్లు మినహా ఈ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఒక్క లైటు కూడా వెలగని దుస్థితి. సంబంధిత అధికారులు స్పందించి రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

సేవా కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - మైదుకూరు

మన చుట్టూ ఉన్న ప్రాంతాలు, ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మైదుకూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి సూచించారు. గురువారం కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి శ్రమదానం చేశారు. మహాత్మా గాంధీ జయంతి వరకు వివిధ స్వచ్ఛత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం, విద్యార్థులు, పౌరులు సమిష్టిగా పాల్గొని తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుభాన్‌సాహెబ్, ఆర్ఆర్సి కో-ఆర్డినేటర్ అయ్యవారురెడ్డి, డాక్టర్ సి నర్సింహారావు, డాక్టర్ ఎస్ నవనీశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, చెన్న రాయుడు, అనురాధ పాల్గొన్నారు.

వేంపల్లె : ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలందరూ కలసి రావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించడం అనేది దేశ ప్రగతికి సోపానమన్నారు. ప్రపంచంలో అధిక కాలుష్యాన్ని వెదజల్లే దేశాల జాబితాలో భారతదేశం ఉండడం చాలా బాధాకరమన్నారు. ప్లాస్టిక్ నివారణకు విద్యార్థులు తమవంతు కృషి చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ చైనాలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా ఉన్నప్పటికీ రీసైక్లింగ్ వ్యవస్థ ద్వారా వాటిని నియంత్రిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కళాశాల ప్రాంత పరిధిలో విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు : గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు సూచించారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పారిశుధ్యంపై అవగాహన కల్పించడంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వేంపల్లె : ఇడుపులపాయలో ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోవర్ధన్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం-11 ఆధ్వర్యంలో విద్యార్థులు క్యాంపస్‌లోని చెత్తచెదారం, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రత ద్వారా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అప్పుడే దేశాభివృద్ధికి బీజం వేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.మధుసూదన, అధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

చక్రాయపేట : పరిసరాల పరిశుభ్రతతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపిడిఒ సోమశేఖర్ పేర్కొన్నారు. గురువారం చక్రాయపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మూడోరోజు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను వాడరాదని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, ఎంపిడిఒ సోమశేఖర్, పంచాయతీ సెక్రటరీ గంగులయ్య, కె.రామచంద్రారెడ్డి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటరామిరెడ్డి, ఫార్మసిస్ట్ గురుప్రసాద్, స్టాఫ్‌నర్స్ అరుణ్‌కుమార్, ఎఎన్ఎం మేరీ పుష్పలత, మెహరాజ్, ఎఫ్ఎన్ఓ హాజీరా, సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సెమిస్టర్ ఫలితాల్లో ఎస్ఆర్ఐటి ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జెఎన్‌టియు జూలై 2024 బిటెక్ థర్డ్‌ఇయర్ 2వ సెమిస్టర్ ఫలితాల్లో సాయి రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి) ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పాండు రంగన్ తెలిపారు. సివిల్ విభాగానికి చెందిన ఎన్ పవన్‌కుమార్‌రెడ్డి 87.22, బి వసంత 85.22, టీ చంద్రిక 82.20, ఈఈఈ విభాగంలో ఎం గురుసుప్రియ 89.56, ఏ నికిత 89.44 కే సుమంత్ 89.22, ఈసీఈ విభాగంలో.. సి సునీత 87.00, కె ప్రవీణ 86.67, సి గాయత్రీదేవి 87.11, సిఎస్ఈ విభాగంలో.. ఎస్ మహేశ్వరి 84.78, షేక్ మహమ్మద్ సాహిల్ 87.00, ఎస్ సాయి శైలజ 83.87 శాతం మార్కులు సాధించి కళాశాల మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్ రెడ్డి, హెచ్‌వోడిలు, అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

ఇ-పంట నమోదుకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇ-పంట నమోదును ఈనెల 23వరకు ప్రభుత్వం పొడిగించినట్లు గురు వారం మండల వ్యవసాయాధికారి నాగార్జున తెలిపారు. పంట నమో దుతోపాటు ఇకెవైసి కూడా తప్పక చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. పంట నమోదు వల్ల రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు, పరిహారాలు వస్తాయన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నమోదు చేసిన రైతుల జాబితాను రైతు సేవ కేంద్రాల్లో ప్రచురించి, గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. తుది జాబితా ఈ నెల 30న ప్రకటిస్తామన్నారు.

సేంద్రియ ఎరువులతో ఖర్చు తక్కువ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

సేంద్రియ జీవన ఎరువులు వాడడం వల్ల ఖర్చులు తగ్గించుకుని రైతులు మంచి లాభాలు పొందవచ్చని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ సుదర్శనచారి, శ్రీహరి సూచించారు. మండలంలోని చెంచయ్యగారిపల్లి, ఎద్దులాయపల్లి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంటసాగులో రసాయన ఎరువులు అధికంగా వాడితే ఆహార ఉత్పత్తులు విషతుల్య మవు తాయన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గిపోయి, పంట దిగుబడులు కూడా అంతగా రావన్నారు. మానవ, జంతువాళికి ముప్పు కలుగుతుందని వివరించారు. రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కంపెనీ ప్రతినిధులు చంద్రశేఖర్, ఎబిఎం, గ్రామ రైతులు పాల్గొనారు.

పొలాలను పరిశీలిస్తున్న రైతులు, నాయకులు

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి

ప్రజాశక్తి - వేముల

రైతులకు న్యాయం జరిగే పోరాడుతామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. యురేనియం కార్మాగారం నుంచి టెయిలింగ్ పాండ్ ద్వారా వచ్చే వ్యర్థాలు పైప్‌లైన్ లీకేజీతో రైతుల పొలాల్లోకి బురదలా చేరిన విషయం విదితమే. ఇందుకు నష్టపరిహారం చెల్లించాలని కొట్టాల రైతులు మూడు రోజులుగా ఆ బురదను తీసేయనివ్వడంలేదు. ఈ నేపథ్యంలో యురేనియం అధికారులు ఎలాగైనా రైతుల పొలంలోని వ్యర్థ పదార్థాలతో కూడుకున్న బురదను తొలగించేందుకు రెవెన్యూ, పోలీసుల సాయంతో ప్రయత్నం చేస్తున్నారనే సమాచారాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ఈ విషయాన్ని మబ్బుచింతల పల్లె మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, పేర్ల పార్థసారథిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు, నాయకులు గుమికూడారు. సమాచారం తెలుసుకున్న యురేనియం అధికారులు సంఘటన స్థలానికి రాకపోవడంతో సాయంకాలం 6 గంటల వరకు వేచి చూచి వెనుదిరిగారు.

పోషకాహారం గురించి వివరిస్తున్న అధికారులు

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఒ శ్రీదేవి కోరారు. మండలంలోని దుంపలగట్టు అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా పౌష్టికాహార ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని, అప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు జహరాభి, వైద్య విస్తరణ అధికారి నాగభూషణం, అంగన్వాడీ కార్యకర్త జె.గంగావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : గర్భిణులు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని పులివెందుల ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీలత పేర్కొన్నారు. మండలంలోని బలపనూరులో గురువారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిడ్డలకు 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. ఏడవ నెల నుండి అనుబంధ ఆహారం పిల్లలకు తినిపించాలన్నారు. విభిన్న ఆహార పదార్థాలను ఏ విధంగా తయారు చేసుకోవాలనే దానిపై తల్లులతో కాంప్లిమెంటరి ఫుడ్ చేయించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంత, అంగన్‌వాడీ కార్యకర్తలు శివమల్లేశ్వరి, లలిత, శాంతకుమారి పాల్గొన్నారు.

చక్రాయపేట : తల్లి గర్భంతో ఉన్నప్పుడు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూపర్‌వైజర్ నాగ సుభాషిణి పేర్కొన్నారు. కొండవాండ్లపల్లెలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నాగసుభాషిణి ప్రారభించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ హాజీరా బేగం, పంచాయతీ సెక్రటరీ అరుణ, ఎఎన్ఎం నవనీత, అంగనవాడీ వర్కర్లు శాంతి, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు, ప్రజలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలను రెన్యువల్ చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని అన్ని ప్రయివేట్ ఆస్పత్రులు, ఫిజియోథెరపీ సెంటర్స్ వారు తమ రిజిస్ట్రేషన్ పత్రాలను రెన్యువల్ చేయించుకోవాలని జిల్లా ఉప వైద్య అధికారి శాంతికళ తెలిపారు. గురువారం స్థానికంగా ఉన్న ప్రయివేటు వైద్యశాలలను, ఫిజియాథెరపీ సెంటర్స్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్పిటల్ యాజమాన్యాలు తప్పక రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. తనిఖీ చేసేటప్పుడు అన్ని రకాల సర్టిఫికెట్స్ ఉండాలన్నారు. లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక తాతిరెడ్డి రామలింగారెడ్డి వైద్యశాలలో ప్రముఖ గైనకాలజిస్ట్ సుచరితతో ఆమె మాట్లాడారు.

సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఉప వైద్యాధికారి శాంతికళ

తప్పులు జరుగుతున్నా.. మారని ఎంపిడిఒ కార్యాలయ పనితీరు

రూ.5 లక్షల నిధులు స్వాహా చేసిన ప్రయివేట్ కంప్యూటర్ ఆపరేటర్ - పంచాయతీ బిల్లులు పెడుతున్న అటెండర్

ప్రజాశక్తి - చాపాడు

మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ పనులకు సంబంధించి వివిధ రకాల నివేదికలను ఉన్నతాధికారులకు పంపేందుకు నియమించిన ప్రయివేటు కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్ బాషా రూ.5 లక్షల పైగా పంచాయతీ నిధులు తన ఖాతాలోకి మళ్లించుకున్న సంఘటన తెలిసిందే. ప్రస్తుతం ఈ నిధులకు సంబంధించి ప్రయివేట్ కంప్యూటర్ ఆపరేటర్‌ను పోలీసులు విచారి స్తున్నారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు విచారణకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఇంత జరుగుతున్నా.. అధికారుల తీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. ఇందుకు నిదర్శనం ప్రస్తుతం కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న శ్రీను పంచాయతీ బిల్లుల వ్యవహారం మళ్లీ కొనసాగిస్తున్నాడు. ఈ అటెండర్ కొన్నేళ్లుగా కార్యాలయంలో తన విధులు పక్కనపెట్టి పూర్తిగా కంప్యూటర్ పనులే చేపడుతున్నాడు. సిఎఫ్ఎంఎస్ బిల్లులు ఆన్‌లైన్ చేయడంలో ఇతనికి మంచి పట్టు ఉన్నట్లు సమాచారం. బద్రిపల్లె పంచాయతీకి సంబంధించి కార్యాలయంలోని అధికారులకు తెలియకుండా రూ.లక్ష బిల్లును సర్పంచ్‌తో కలిసి విడుదల చేయించినట్లు సమాచారం. ఈ విధంగా అన్ని గ్రామాల సర్పంచులతో, ప్రజాప్రతినిధులతో నేరుగా సంబంధాలు పెట్టుకుని బిల్లులు చేస్తూ తన అటెండర్ పనిని పక్కనపెట్టి పూర్తిగా కంప్యూటర్ పనికే పరిమితమయ్యాడు. అయితే అతనిని కంప్యూటర్ పని చేయకుండా కట్టడి చేయాల్సిన అధికారులు ఏ మాత్రం అడ్డు చెప్పడం లేదు. ప్రస్తుతం కార్యాలయంలో రూ.5లక్షల అవినీతి బయటపడిన తర్వాత కూడా జాగ్రత్త పడలేదు. గురువారం చియ్యపాడు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ డిఎస్‌కేను ఉపయోగించి బిల్లులు పెట్టే పనిలో నిమగ్నమయ్యాడు. కార్యాలయంలో ప్రభుత్వం నియమించిన కంప్యూటర్ ఆపరేటర్ ఉన్నప్పటికీ బిల్లుల వ్యవహారం పూర్తిగా అటెండర్, ప్రయివేట్ ఆపరేటర్ మాత్రమే ఇప్పటివరకు చూస్తున్నారు. వీరు బిల్లులు మం జూరు చేయించడంలో ఆన్‌లైన్‌లో ప్రావీణ్యం సంపాదించి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సెటిల్మెంట్ చేసుకోవడం కార్యాలయ ఉన్నతాధికారులతో ఏమాత్రం పని లేకుండానే బిల్లులు వచ్చేలా చేసే ప్రావీణ్యం కలిగి ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ నిధుల బిల్లులు అధికారుల సమక్షంలో అర్హతగల సిబ్బందిచే చేయిస్తే అవకతవకలు జరిగే అవకాశం ఉండదు. అటెండర్ శ్రీను ఇప్పటివరకు చేసిన బిల్లులపై సమగ్ర విచారణ చేపడితే మరింత అవినీతి బాగోతం బయటపడే అవకాశం ఉంటుం దని సమాచారం.



చియ్యపాడు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ డిఎస్‌కెను ఉపయోగిస్తున్న అటెండర్

మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

జమ్మలమడుగు రూరల్ : జిల్లాలోని మహాత్మాజ్యోతిభాపూలే సంక్షేమ గురుకుల పాఠశాల వనిపెంటలో 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డెమో ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్/పార్ట్ టైమ్ టీచర్స్‌ను భర్తీ చేస్తున్నామని, ఆసక్తిగల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపల్ కెవిఎస్ రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నేరుగా జమ్మలమడుగు జ్యోతిభాపూలే పాఠశాలను సంప్రదించవచ్చాన్నారు. శనివారంలోపు పంపాలన్నారు. పిజిటి ఇంగ్లీషు 1, టిజిటి ఇంగ్లీషు 1, టిజిటి సైన్స్ 1, టిజిటి సోషల్ ఒకటి ఖాళీ ఉన్నాయన్నారు. పిజిటి, టిజిటికి పీజీ, బిఎడ్, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE IVth ADDITIONAL DISTRICT JUDGE, KADAPA

Guardian OP No. 42/2024

(In the matter of appointment of Guardian in respect of person of minor Koduru Giri Chethan Reddy, S/o Late Koduru Siva Sankar Reddy, aged about 3 years and 10 months for person and family pension under 32 Rule 1 CPC R/W under section 7&8(a)(b)of Guardians and wards Act 1890).

...Petitioner

Vs

NIL. ...Respondents

GENERAL PUBLICATION

పై తెలిపిన Koduru Sankar Reddy పై తెలిపిన కోర్టు నందు Minor Boy అయిన Girichethan Reddy, S/o Late K.Siva Sankar Reddy యొక్క సంక్షేమము చూసుకొనుటకు మరియు Family Pension amount from local Fund office, Kadapa (District Treasury office, Kadapa) నుండి తీసుకొని పై తెలిపిన Minor Boyకి ఖర్చుపెట్టుటకు Guardian గా Oppoint చేయమని పైతెలిపిన కోర్టులో కేసు వేసినాడు. పై తెలిపిన Case 27.9.2024వ తేది ఉ॥10 గం॥లకుపై తెలిపిన వారి హాజరు నిమిత్తము వాయిదా వున్నది. ఎవరికైన ఆక్షేపనలు వున్న యెడల పై తెలిపిన తేదిన పై గంటలకు మీరు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై ఏమైనా ఆక్షేపనలు వున్న యెడల తెలియజేసుకొనవచ్చును. అట్లు లేనియెడల పై తెలిపిన కోర్టు వారు పరోక్షముగా పై కేసును తీర్మానించెదరు అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 27.09.2024.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

V. ESWARA REDDY,B.Com.,B.L.,
Advocate, KADAPA.